రాణక్క

రావు కృష్ణారావు

“సీతమ్మా... నలుగురికి వంట చేయమన్నారు” హాల్లో నుండే కేక వేశాడు కాంపౌండరు.

“అలాగలాగే... వినపడింది... ఇంక కేకలేయకు” వంటింట్లోంచి సీతమ్మ సమాధానం వినిపించింది.

“నలుగురేనా?... ఇంకెవరూ లేరా? ఎవరూ లేకపోతే మరో నలుగురు పేషెంట్లను పంపించు” అపుడే హాల్లోకి వచ్చిన శాంతమ్మ కోపంగా అంది.

“నేనేం చెయ్యనండీ... డాక్టరుగారు చెప్పి రమ్మన్నారు” నసిగాడు కాంపౌండరు.

“ఇపుడయిదున్నరయ్యింది. ఇద్దరూ మధ్యాహ్నం భోజనానికి రాలేదు. టీ నీళ్ళైనా తాగారో లేదో! ... ఇంకా ఎంత టైము పడుతుంది?”

“పొరుగూరోళ్ళందరూ అయిపోయారండి. లోకల్ పేషెంట్లు తాపీగా దిగబడుతున్నారు... ఏడైపోవచ్చింది” అని చెబుతుండగానే తలుపు తెరుచుకొని హాల్లోకి ప్రవేశించాడు హరి!

“బావున్నారాండీ? ఎపుడొచ్చారు?” అంటూ ప్రశ్నించాడు హరి.

“ఆఁ... ఆఁ... బాగానే ఉన్నాను. నేనొచ్చి పది రోజులయ్యింది. పది రోజుల్నుండీ కనిపించలేదేంటి? మీ ఆవిడా, అమ్మాయి బావున్నారా? అమ్మాయి ఫిఫ్త్ క్లాసు కదా! నీకు ప్రమోషనొచ్చిందా?” మొహాన్ని ప్రశాంతంగా మార్చుకొనే ప్రయత్నం చేస్తూ వరుస ప్రశ్నలు గుప్పించింది శాంతమ్మ. కాంపౌండరు మెల్లిగా జారుకున్నాడు.

“ఊరికెళ్ళానండీ! ... అంతా బాగానే వున్నారు. ప్రమోషను రావడానికింకో సంవత్సరం పడుతుంది. ప్రమోషనిస్తే ఇక్కడుంచరు... అదే బెంగగా ఉంది”.

“అలా నిలబడిపోయావేంటీ... కూర్చో... టీ తాగుతావా?”

“వద్దండీ”... ఇపుడే ఇంటిదగ్గర తాగి బయలుదేరా!... ఏడు గంటలకు మోటారు వర్కర్స్ యూనియన్ కమిటీ మీటింగుంది... మాట్లాడే పనుంది కాస్త ముందు రమ్మన్నారు డాక్టరుగారు”.

“ఇంకేం... ఆయన గారింకా హాస్పిటల్‌లోనే ఉన్నాడు. నువ్వక్కడికే వెళ్ళి అట్నుంచటే తీసుకుపో... అతగాడికి తిండి, నిద్ర మరేమీ అక్కర్లేదు. దేశ సేవుంటే చాలు. పొద్దుట ఎనిమిదిన్నరకెళ్ళారిద్దరూ... మధ్యాహ్నం భోజనానికి రాలేదు. సాయంత్రమైనా ఇంటికొచ్చి కాస్త కాఫీ తాగి రెస్టు తీసుకోవచ్చు కదా! చిట్టయ్య, పిన్నమ్మ వీళ్ళకంటే ఎక్కువే చేశారు. కాని వాళ్ళు కచ్చితమైన టైములు పాటించేవారు. అయినాగానీ నువ్వేమో బాంకు ఉద్యోగివి. ఆయనేమో డాక్టరు మీకు మోటారు వర్కర్స్‌తో పనేంటయ్యా?” కాస్త కోపంగా అడిగింది శాంతమ్మ.

“ఆ రోజుల్లో వైద్యం కోసం ఇంత మంది వచ్చేవారు కాదేమోనండి”.

“చిట్టయ్య కూడా పార్టీ వ్యవహారాల్లో తిరిగేటపుడు భోజనం వేళకి భోజనం కుదరకపోతే అరటిపళ్ళు తినేవారు కాని ఇతగానిలా పస్తుండిపోయేవారు కాదు. ఏమైనా ఆయన అలవాట్లు తనకు రాలేదు. సాయంత్రం ఇంటికొచ్చింతర్వాత కూడా భోజనం చేసి పడుకుందామని చూడడు. ఉప్మాలాంటిదేదో చేయించుకు తిని వెళ్ళి పోతాడు. మీటింగులంటాడు. సినిమాలంటాడు. నాటకాలంటాడు, బుర్రకథలంటాడు ఇవేవీ లేకపోతే జనాలతో ఇంట్లోనే అర్ధరాత్రి దాకా కబుర్లు! తిండి అంటే చాలా ఇష్టం. కాని వేళకి నచ్చినవి తినలేకపోతున్నాడు. ఇలాగైతే ఆరోగ్యం ఏమైపోతుంది!”

కథ

“పార్టీ నాయకులు, పెద్దలూ ఆ మధ్య లంచ్ బ్రేక్ ఇవ్వమని సలహా ఇచ్చారు. “అంత దూరం నుండి వాళ్ళు వచ్చేసరికి ఈ టైమవుతుంది. వాళ్ళు ఏదో బాధతో ఆదుర్దాతో ఉంటారు. అలాంటి పేషెంట్లతో ‘మీరిక్కడే కూర్చోండి... నేను భోజనం చేసి కాసేపు నడుం వాల్చివస్తాను” అని ఎలా చెప్పను? అదీగాక తీరుబడిగా నేను సాయంత్రం వాళ్ళను చూస్తే వాళ్ళు తిరిగి వాళ్ళూరు వెళ్ళడం కష్టమైపోతుంది” అన్నారండి. ఇంకెవ్వరూ మాట్లాడలేకపోయారు” అన్నాడు హరి!

పోనీ రాణమ్మ సంగతి చూస్తే... ఆవిడగారీయనతో పోటీపడుతోంది. ప్రొద్దుటే హడావుడిగా కాస్త టిఫిను తిని అనేకసార్లు కాఫీ కూడా త్రాగకుండా వెళ్ళిపోతుంది. కాఫీ అంటే తనకు చాలా ఇష్టం.

మీ ప్రాక్టీసులో వందో వంతు కూడా లేనివాళ్ళు సైతం కారు కొనుక్కుంటున్నారు. ఈ ఊర్లో కారులేని డాక్టర్లు మీరిద్దరే! పిల్లలు ఎదుగుతున్నారు. ఇపుడు మున్సిపల్ స్కూల్లో చదివించేస్తున్నావు. ఎల్లకాలం ఇలా సాగదు. ఖర్చులు పెరుగుతాయి. నీ కొడుక్కి నీవు కట్నం తీసుకోకపోవచ్చు. కాని నీ కూతురికివ్వాలి కదా! అపుడేం చేస్తావు?

సాయంత్రం వస్తుందా!... కాఫీ త్రాగి కాస్త నడుం వాల్చు తల్లీ అంటే గరిటె పుచ్చుకొని వంటకు తయారవుతుంది. పెళ్ళయ్యే వరకూ ప్లేటు కూడా కడిగి ఎరుగదు. ఇపుడు పెద్ద వంటలక్కయి పోయింది. ఈవిడ వండి వడ్డించడం అతిథులంతా అద్భుతం, అమోఘం అంటూ లొట్టలేసుకు తినడం. నాలుగు మెతుకులు తిని 11 గంటలకో, 12 గంటలకో పక్కమీదికి చేరుతుంది. ఈలోగా ఏదో పురిటికేసు వచ్చిందంటూ కబురొస్తుంది. అంతే! మళ్ళీ ఇంటికి చేరేది ఏ తెల్లవారుజామునో! పది రోజుల నుండీ చూస్తున్నా ఒక్కరాత్రి కూడా అది నిద్ర పోలేదు పూర్తిగా! వాళ్ళకి కావలసినవి హడావుడిగా అమర్చిపెట్టడమేగాని పిల్లలతో కాసేపు సరదాగా గడిపే టైము కూడా దానికుండటం లేదు. వీళ్ళు చేస్తున్న వైద్య సేవ చాలక ఇంటిని నిత్యాన్నదాన సత్రంకింద మార్చేశారు. భోజనాల వేళకి ఇంట్లో ఉన్నవాళ్ళందరినీ... చివరకు ఊళ్ళోవాళ్ళను, పక్కింటి వాళ్ళను కూడా భోజనం చేసెయ్యమని బలవంతపెట్టి మరీ తినిపించేస్తున్నారు. ఒక్కోసారి మంది ఎక్కువై చివరకు రాణమ్మకు తినడానికేమీ ఉండటం లేదు తెలుసా! వీళ్ళనీ, ఈ ఇంటినీ చూస్తుంటే నాకు చాలా భయమేస్తోంది. బాధ, కోపం ఆపుకోలేకపోతున్నాను" ఆవేశంగా చెప్పసాగింది శాంతమ్మ.

ఊఁ... ఆఁ... అనకుండా మౌనంగా వింటున్నాడు హరి.

"ప్రజల ఆరోగ్యం గురించి పాటుపడే వీళ్ళు తమ ఆరోగ్యం గురించి కూడా కాస్త శ్రద్ధ పట్టాలి కదా! వీళ్ళు బావుంటేనే కదా నాలుగు కాలాలపాటు ప్రజాసేవ చేయగలిగేది! నీలాంటి మిత్రులే అతగానికి కాస్త నచ్చచెప్పాలి".



"అమ్మో... డాక్టరుగారికి చెప్పేంత ధైర్యం లేదు నాకు. అదీగాక ఆయనవల్ల అనేక ఉపకారాలు పొందాను, పొందుతున్నాను కూడా! నేనాయనకు కాస్త ప్రజాసేవ తగ్గించండని సలహా ఇస్తే "నాకు తప్ప మిగతావాళ్ళకంతగా సాయపడనక్కర్లేద"ని చెప్పినట్లవుతుంది. మీరు ఆయనకు అత్తగారు, వరుసకు అక్క అవుతారు. చిన్నప్పటి నుండీ ఆయన దగ్గర మీకు చనువుంది. పైగా మీరంటే ఆయనకెంతో గౌరవం కూడాను... మీరే మాట్లాడి చూడండి" చెప్పాడు హరి!

"నీ సలహా బాగుంది గానీ నేనతగానితో ఇలాంటివి మాట్లాడ గలిగితే నిన్నూ నిన్నూ బతిమాలుకోవడం ఎందుకూ..."

"ఇక నేను వెళతానండీ!"

"సరే వెళ్ళు. మళ్ళీ వస్తావు కదా! నా మాట అతనితో అనకు సుమా... మనసు కష్టపెట్టుకుంటాడు. ఆ మీటింగులోనైనా కాస్త కాఫీ తెప్పించి ఇవ్వండతగానికి".

"భలేవారే! అందరికీ మిరపకాయ బజ్జీలూ, టీలూ డాక్టరుగారే తెప్పిస్తారు" అని నవ్వుతూ నిష్క్రమించాడు హరి!

***

"రా అమ్మా వచ్చావా... సీతమ్మా అమ్మగారొచ్చారు కాఫీ కలుపు... బాగా కలపాలి... మంచినీళ్ళిస్తానుండు" అంటూ గబగబా ఫ్రిజ్‌లోంచి సీసా తీసి అబ్బే... అస్సలు చల్లగా లేవు... ఎప్పుడు పెట్టిన సీసాలపుడే ఖాళీ చేసేస్తున్నారు" అంటూ కంగారుపడసాగింది శాంతమ్మ.

"పరవాలేదు... ఇలాగియ్యి..." సీసా అందుకుని మంచినీళ్ళు త్రాగసాగింది రాణక్క అని అందరూ పిలుచుకొనే డా॥ రాణి.

"ఏదో విధంగా అయిదు నిముషాలు ఖాళీ చేసుకొని నాలుగు మెతుకులు తినిపోవచ్చు గదే!"

"నేనూ అలాగే అనుకుంటాను... ఇంటికొళ్ళొస్తాను అనగానే అంతమంది పేషెంట్ల కళ్ళలో కనిపించే నిరాశను చూడలేక రాలేకపోతున్నాను".

"వాళ్ళేమో తీరుబడిగా భోజనం చేసివస్తారు! నీ భోజనం కోసం వాళ్ళు ఒక్క అరగంట వేచి ఉండలేరా? అయినా నువ్వు తిండి మానుకొని వాళ్ళకెందుకు చెయ్యాలి వైద్యం.

వాళ్ళేమైనా ఏభైలూ, వందలూ ఫీజులిస్తున్నారా? నీ బాగ్‌లో ఎపుడు చూసినా రూపాయి, రెండూ, అయిదూ తప్ప ఒక్క పది రూపాయల నోటు కనిపించలేదు నాకు" రుసరుసలాడింది శాంతమ్మ.

"ఏంటమ్మా!... ఏమైందివాళ నీకు?" నవ్వుతూ అడిగింది రాణి.

ఆ నవ్వు చూసి ఒక్క క్షణం నిర్ఘాంతపోయిన శాంతమ్మ మరుక్షణం తేరుకుని "అంత బడలికతో కూడా ఎంతందంగా నవ్వుతున్నావే...

"ఇంత ఓపిక, సహనం ఎలా వచ్చాయే తల్లీ నీకు..." అంటూ ఆశ్చర్యం నిండిన మొహంతో కాసేపు అలాగే ఉండిపోయింది శాంతమ్మ.

"ఇదుగోండమ్మా కాఫీ" అంటూ ఒక గ్లాసుతో వచ్చింది సీతమ్మ.

ఆ గ్లాసు అందుకొని "ఈ వేళ అమ్మగారు వంట చేయరు. నువ్వే చేసెయ్! వీధి తలుపులు చేరవెయ్యి"అని చెప్పింది శాంతమ్మ.

"అలాగేనమ్మా!" అంటూ వెళ్ళిపోయింది సీతమ్మ.

కాఫీ గ్లాసు భద్రంగా రాణికి అందించి గది తలుపులు మూసి గడియ వేసింది శాంతమ్మ.

"ఎందుకూ తలుపులేస్తున్నావ్!"

"ఇది పడగ్గది అనిగాని, డాక్టరమ్మ కాసేపు పడుకుంటుందేమోననిగాని ఆలోచించే వాడెవడూ లేడు. తిన్నగా వచ్చేసి మంచం మీదే కూర్చుండిపోతారు. నీ ఇల్లంతా ఒక పబ్లిక్ పార్కులాగా తయారైంది".

"సరే... సరేలే" అంటూ కాఫీని కొంచెంకొంచెం చప్పరిస్తూ దాని రుచిని ఆస్వాదించసాగింది రాణి.

"మీ పద్ధతి నాకు నచ్చలేదు. రాత్రీ, పగలూ అనక, తిండీ నిద్రా లేకుండా గొడ్డుల్లా కష్టపడుతున్నారు. పోనీ దానికి తగ్గ ఆదాయముందా...

అంటే అదీ లేదు... తాతలనాటి మట్టి గోడలూ, గూడపెంకుల ఈ ఇల్లు ఇంకెన్నాళ్ళో ఉండదు. ఇల్లు కట్టు కోరా?... మీ ప్రాక్టీసులో వందో వంతు కూడా లేనివాళ్ళు సైతం కారు కొనుక్కుంటున్నారు. ఈ ఊర్లో కారులేని డాక్టర్లు మీరిద్దరే! పిల్లలు ఎదుగుతున్నారు. ఇపుడు మున్సిపల్ స్కూల్లో చదివించేస్తున్నావు. ఎల్లకాలం ఇలా సాగదు. ఖర్చులు పెరుగుతాయి. నీ కొడుక్కి నీవు కట్నం తీసుకోకపోవచ్చు. కాని నీ కూతురికివ్వాలి కదా! అపుడేం చేస్తావు?"

"నువు చెప్పింది నిజమే! భవిష్యత్తు గురించి ఎపుడైనా ఆలోచిస్తే నాకూ భయమేస్తుంది. అయితే ఆస్తులు సంపాదించడం కోసం వైద్యం చేయడం ఆయనకిష్టముండదు. కాని బతకాలి కాబట్టి ఎంతో కొంత తీసుకోవాలి. ఒకో నెల ఇంటి ఖర్చులకి కూడా సరిపోవడం లేదు. కన్సల్టేషను ఫీజు అయిదు రూపాయిలు వసూలు చేయమంటున్నారందరూ! త్వరలోనే ఏదోటి చెయ్యాలి!"

ఈ రోజుల్లో అయిదు రూపాయిలేంటి? 25 రూ॥ కంటే తక్కువెక్కడైనా ఉందా? కనీసం పది రూపాయిలైనా ఫిక్స్ చెయ్యి".

నిలయం

**"ఆయనకు మనుషులంటే ఇష్టం.
ప్రతి నిముషం తనచుట్టూ మనుషులుండాలి.
వాళ్ళతో మాట్లాడాలి, చర్చించాలి, నవ్వాలి, వాళ్ళకు అన్నీ
తినిపించాలి, వాళ్ళు తింటుంటే చూసి ఆయన సంతోషించాలి.
ఆ మనుషుల్లో మంచివాళ్ళు, చెడ్డవాళ్ళు, గొప్పవాళ్ళూ, సామాన్యులూ
అందరూ ఉంటారు. ఆయనకు మనుషులుంటే మరేమీ అక్కర్లేదు.
మనుషులు కలవకపోతే వాళ్ళతో మాట్లాడకపోతే ఆయన చాలా
బెంగపడిపోతారు".**

"అయిదు రూపాయిలకే నేను తటపటాయిస్తుంటే నువ్వు ఏకంగా పదంటున్నావు".

"మరో విషయం! ఈ కొంప ధర్మసత్రంకంటే అన్యాయంగా తయారైంది. ఎవరొస్తున్నారో, ఎవరు పోతున్నారో తెలియడం లేదు. ప్రతీవాళ్ళూ వాళ్ళ సొంత ఇంటిలోలాగా తిరిగేస్తున్నారు. ఎవరూ ఎవర్నీ అడగరు. పేషెంట్లిచ్చిన పళ్ళూ ఫలహారాలూ టేబిలు మీద పెడితే గంటలో ఖాళీ! పోనీ టేబిలు మీదుంచినవి తీసుకున్నారంటే పోనీలే అనుకోవచ్చు. మొన్న ఎవరో పేషెంటు అరటిపళ్ళూ, ఒక్క యాపిలు పండూ తెచ్చి ఇచ్చాడు. అరటి పళ్ళు టేబిలుమీద పెట్టి యాపిలొకటీ అలమార్లో పెట్టాను. అది కూడా తీసేసుకున్నారెవరో! మరీ ఇలాగయితే ఎలా ఎంతో కొంత కట్టడి చేయాలి కదా!

"ఆయనకు మనుషులంటే ఇష్టం. ప్రతి నిముషం తనచుట్టూ మనుషులుండాలి. వాళ్ళతో మాట్లాడాలి, చర్చించాలి, నవ్వాలి, వాళ్ళకు అన్నీ తినిపించాలి, వాళ్ళు తింటుంటే చూసి ఆయన సంతోషించాలి. ఆ మనుషుల్లో మంచివాళ్ళు, చెడ్డవాళ్ళు, గొప్పవాళ్ళూ, సామాన్యులూ అందరూ ఉంటారు. ఆయనకు మనుషులుంటే మరేమీ అక్కర్లేదు. మనుషులు కలవకపోతే వాళ్ళతో మాట్లాడకపోతే ఆయన చాలా బెంగపడిపోతారు".

"ఇంట్లో ఎపుడూ ఒకర్నో ఇద్దర్నో పెట్టుకుని చదివిస్తున్నారు. పార్టీవాళ్ళు రోజూ భోజనాలకి వస్తూనే ఉన్నారు. వీళ్ళు చాలరా!"

"చాలరు. ఆయనకి ప్రపంచంలోని మనుషులందరూ కావాలి! అందుకే ఈ ఇల్లు ఎప్పటికీ ఇలాగే వుంటుంది. ఈ విషయంలో ఇంక నువ్వేమీ మాట్లాడకు'.

"అది కాదే... అంటూ శాంతమ్మ ఇంకా ఏదో చెప్పబోయేసరికి తలుపు చప్పుడయ్యింది. తలుపుకు దగ్గరగా ఉన్న శాంతమ్మ గడియ తీసి ఒక తలుపు కొద్దిగా తెరిచింది.

"ఎవరో పేషెంటొచ్చారమ్మా..." చెప్పింది పనిమనిషి.

"చావమను... అమ్మగారిపుడు చూడరు..." నెమ్మదిగానే అయినా కోపంగా చెప్పింది శాంతమ్మ.

"అమ్మా... తప్పు... అలాగెపుడూ మాట్లాడొద్దు... తప్పుకో" అంటూ హాల్లోకి వచ్చి వీధి తలుపు తెరచింది రాణి.

"రక్షించండి డాక్టరమ్మగారూ... నా కొడుకుని మీరే రక్షించాలి. మీకెంత ఫీజు కావాలంటే అంతా ఇచ్చుకుంటాను... కాదనకండి... హాస్పటలికెళ్ళాను డాక్టరుగారు ఏదో మీటుంగుకెళ్ళారంట... ఇంక మీరే రక్షించాలి కాదన కండమ్మా..." అంటూ వంగి రాణీ కాళ్ళు పట్టుకోబోయాడు ఒక నడివయస్కుడు.

"లేవండి! నాకిలాంటివి నచ్చవు. ఇంతకీ ఏమైంది?"

"డాక్టరుగారు చూసి కాకినాడ పెద్దాసుపత్రికి తీసికెళ్ళమన్నారు. పైకి బాగానే ఉన్నాడు కదాని కొంత, పెద్దాసుపత్రిలో యాతనలు పడలేనని కొంత ఆలోచించి ఈ ఊళ్ళోనే వీరయ్య డాక్టరుకు చూపించాం. 10 రోజులు ఆసుపత్రిలో పెట్టుకొని అయిదువేలు ఖర్చు పెట్టించి ఇపుడు లాభంలేదు తీసుకుపొమ్మన్నాడండి" ఏడుపు గొంతుతో చెప్పాడతను.

"డాక్టరుగారు పెద్దాసుపత్రికి తీసుకెళ్ళమంటే ఆయన మాటల మీద మీకు ఎందుకు నమ్మకం కుదరలేదు?... నిజం చెప్పండి".

"చాలా కాలం నుండీ మా కుటుంబానికి మీరిద్దరే వైద్యం చేస్తున్నారు. అయినా నేను ఏనాడూ పైసా ఫీజు ఇవ్వలేదు... అందుకనీ... అందుకనీ మాకు వైద్యం చేయం ఇష్టంలేక... పంపించేస్తున్నారేమోనని పాపిష్టి ఆలోచనొచ్చింది. నేను నిజంగా పాపిష్టివాడినే... నా కొడుకు మీద ఒట్టేసి చెబుతున్నా ఇంతకంటే వేరే ఏంలేదు... నా కొడుకు నెలాగైనా రక్షించు తల్లీ!"

"అది మేం ఈ ఊళ్ళో చేసే వైద్యం కాదనీ, పెద్దాసుపత్రిలో స్పెషలిస్టులు చూస్తారనీ వెళ్లమన్నాం! మీరు కాకినాడ వెళ్ళకుండా ఈ వూళ్ళోనే వైద్యం చేయిస్తున్నారని తెలిసి కుర్రాడి ప్రాణాలకు ప్రమాదమంటూ ఆయనెంతసేపు బాధపడ్డారో తెలుసా!"

"చెంపలేసుకుంటున్నాను తల్లీ..." అంటూ చెంపలు టపటపా వాయించేసుకున్నాడా మనిషి.

"ఇంతకీ అబ్బాయేడీ! అంటూ వీధిలోకి చూసి టార్చి తీసుకొని గబగబా వీధిలో ఆగి ఉన్న రిక్షా దగ్గరకు వెళ్ళి తల్లి భుజంపై వాలిపోయిన 16 ఏళ్ళ అబ్బాయిని టార్చి వెలుగులో పరిశీలించింది రాణి. ఆ అబ్బాయి తల్లి కళ్ళ నీళ్ళతో పదే పదే నమస్కారాలు చేసింది రాణికి. వరండాలోకి తిరిగి వచ్చిన రాణి ఆ వ్యక్తితో "ఇప్పటికీ మించిపోయిందేం లేదు. వెంటనే టాక్సీ కట్టించి కాకినాడ తీసుకెళ్ళండి! ఆ డాక్టరుగారు చీటీ ఏమైనా రాసిచ్చారా?"

"లేదండి... మన డాక్టరుగారు రాసిచ్చిన చీటీ పోయిందండి!"

"సరే సరే! నేను రాసిస్తాను. వెంటనే తీసుకెళ్లండి. మరేం పర్వాలేదు తప్పక నయమవుతుంది" అంటూ గబగబా ఉత్తరం రాసిచ్చింది. అది తీసుకొని పదేపదే నమస్కారాలు చేస్తూ వెళ్ళిపోయాడతను.

"ఇలాటోళ్ళ కోసమే కదా మీరు తిండీ, నిద్రా మానుకొని సేవ చేస్తున్నదీ?" కోపంగా అడిగింది శాంతమ్మ.

“లేదు. అందరూ ఇలాగుండరు. నూటికి పదిమంది ఇలాంటో ళ్ళుంటారు. చాలమంది ఫీజు ఇవ్వలేకపోయినా కాయో, సగండో ఏదోటి ఇద్దామనే చూస్తారు. కూలిపనులు దొరుకుతున్నపుడు, కూలి రేట్లు బాగున్నపుడు చాలమంది ఎంతోకొంత ఫీజుఇవ్వాలనే చూస్తారు. కూలిరేట్లూ, రైతుల ఆదాయాలూ పెరుగుతున్నాయి. ముందు ముందు మన ఆదాయం కూడా పెరుగుతుంది” శాంతంగా చెప్పింది రాణి.

“మనుషులు చాలా బాధలు పడుతున్నారనే మాట నిజమే! వాళ్ళకు ఎంతో కొంత సాయం చెయ్యాలనే మాట కూడా నిజమే! అయితే వాళ్ళందరి బాధ్యత మీ ఇద్దరిపైనే లేదు కదా! మరి మీ బాధలు ఎవరు తీరుస్తారు”.

“మేం ప్రపంచంలోని వాళ్ళందరి బాధలూ తీరుస్తున్నామని గాని, తీర్చగలమని గాని అనుకోవడం లేదు. మా దగ్గరికి వైద్యంకోసం వచ్చినవాళ్ళకి మా చేతనైన సాయం చేస్తున్నాం అంతే! డబ్బు చాలా అవసరమే కాని ఆ డబ్బు కోసం ఒక ప్రాణం రక్షించే బాధ్యత నుండి తప్పుకోం!”

“వళ్ళు గుల్ల చేసుకొని వైద్యం చేస్తున్నారు సరే! మందులు కూడా కొనివ్వాలా?”

“పేషెంట్లందరికీ మందులు కొనివ్వడం అసాధ్యం, అబద్ధం కూడా! ఒకోసారి కొంతమందికివ్వాల్సి వస్తుంది. నా దగ్గర పుట్టిన నెలబిడ్డకు కళ్ళకలక వచ్చింది. చుక్కలమందు రాసిచ్చాను. అది కొనడానికి డబ్బుల్లేక, వాళ్ళూరిలో ఎవరో చెబితే జిల్లేడు పాలు పోయమంటే పోసేసిందటా బిడ్డ తల్లి. కళ్ళు రెండూ పోయే పరిస్థితి వచ్చి కంగారు పడి మళ్ళీ నా దగ్గరకు తీసుకొచ్చింది. నిజానికటువంటి స్థితిలో ఉన్న పుడు కంటి డాక్టరు దగ్గరకు పంపాలి. ధైర్యం చేసి నేనే మందులు రాసాను. ఆ తల్లి వాలకం చూస్తే ఆ మందులు కొనలేదని తెలుస్తూనే ఉంది. ఆ పసిబిడ్డ గుడ్డిదైపోతుంటే చూస్తూ ఎలా వుండిపోగలం! మేం డాక్టర్లకంటే ముందు మనుషులం కదా! నేనే మందులు తెప్పించాను. ఆరోజు అప్పటివరకూ వచ్చిన డబ్బులన్నీ అయిపోయాయి. ఒక్కక్షణం అదో విధమైన నిస్పృహ కలిగింది. అయితే పది రోజుల తర్వాత మళ్ళీ ఆ బిడ్డను తీసుకొచ్చిందామె. నిజంగా ఆ చంటిదాని కళ్ళు చూసి నాకు ఎంత ఆనందం కలిగిందో తెలుసా? అటువంటి ఆనందాలు డబ్బు సంపాదనలో దొరకవు”. “ఆనాటి ఆ ఆనందం ఎంత గొప్పదో ఇపుడు నా మొహం చూసి తెలుసుకో అన్నట్లు వెలిగిపోతున్న మొహంలో తళతళలాడుతున్న కళ్ళతో తల్లి కళ్ళలోకి చూసింది రాణి.

“బాగుందమ్మా నీ సంబడం! కాస్త నిలదొక్కుకున్న తర్వాత ఇలాంటి సాయాలు చేసినా ఎవరూ కాదనరు. అతనితో పోటీపడి నువ్వూ ఇలా దానధర్మాలు చేస్తే రేపు సంసారం ఏమవుతుందో ఆలోచించావా? అతగానికెలాగూ ఈ విషయాలు పట్టవు. తనకి చెప్పడానికి కూడా ఎవరూ సాహసించరు. భవిష్యత్ గురించి ఆలోచించమని కాస్త జోరు తగ్గించమని నువ్వే నచ్చచెప్పాలి. సంసారం తనొక్కడిదే కాదు నీది కూడా! నీకా హక్కుంది”.

“నువు తప్పుగా అర్థం చేసుకున్నావు. ఇలా చేయమని ఆయన నాకెప్పుడూ చెప్పలేదు. నేనేం చేసినా ఆయనడ్డు చెప్పరు. ఫీజు కచ్చితంగా వసూలు చేసినా, సాయాలు చేగుడం మానేసినా ఆయన నన్నేమీ అనరు. లోలోపల బాధపడతారు. అది నేను సహించలేను. ఆయన ప్రేమను చవిచూశాక, ఆయన మనసు తెలుసుకున్నాక నేనింకెంతమాత్రం వేరు మనిషిని కాను. ఆయన ఆశయాలే నా ఆశయాలు ఆయన ఆలోచనలే నా ఆలోచనలు. ఆయన జీవితమే నా జీవితం...”.

చివరి వాక్యాలు చెబుతున్నపుడు రాణి గొంతు జీరబోయింది. కొన్ని అక్షరాలు వినిపించలేదు. ఆయాసపడసాగింది.

“అయ్యో!... మళ్ళీ ఆయాసం వస్తుందా? ఈ మాయదారి దీపం పురుగు లెక్కడ్నించి వచ్చాయో!” అంటూ గోడల వైపు ట్యూబులైటు కిందా చూడసాగింది శాంతమ్మ.

“పురుగులెక్కడా కనిపించడం లేదే...” సాలోచనగా అంది శాంతమ్మ.

“ఎక్కడో ఉండే ఉంటాయి. మంచి నీళ్ళందుకో టాబ్లెట్ వేసుకుంటాను”.

శాంతమ్మ పరుగులాంటి నడకతో మంచినీళ్ళు తెచ్చింది రాణి టాబ్లెట్ నోట్లో వేసుకొని ఒక గుక్క మంచినీళ్ళు తాగింది. ఆయాసం మరికాస్త పెరిగింది.

“అమ్మా ఆయనకిష్టంలేనిదేదీ నేను చేయను. ప్రస్తుతం ఆర్థికంగానూ, శారీరకంగానూ ఏవో కొన్ని ఇబ్బందులు పడుతున్నా మేం చాలా ఆత్మసంతృప్తితోనూ, ఆత్మగౌరవంతోనూ చాలా సంతోషంగా బతుకుతున్నాం! మా గురించి నువ్వు ఎక్కువ ఆలోచించి ఆందోళన పడిపోకు. బంగ్లాలు, పెద్దపెద్ద కార్లు కొనలేకపోయినా మేం బాగానే బతగ్గలుగుతాం! రోడ్డున పడం. అనవసరపు ఆలోచనలు మాని సుఖంగా వుండు” ఆయాసపడుతూ ఆగి ఆగి చెప్పినా ఆ మాటలు చాలా దృఢంగా వినిపించాయి.

“సరేలే! కాసేపు కళ్ళు మూసుకొని పడుకో! ఈ వేళైనా ఇంక హాస్పిటల్‌కు వెళ్ళకు” శాంతంగా చెప్పింది శాంతమ్మ.

“నెలలు నిండినవాళ్ళు ముగ్గురున్నారు హాస్పిటల్‌లో” నీరసంగా, చిన్నగా నవ్వుతూ చెప్పింది రాణి.

“పిల్లలకు శలవులే కదా పది రోజులు నా దగ్గరకొచ్చి వుంటే కాస్త రెస్టు దొరుకుతుందంటే అలా రానంటావు... అతగాడు నిన్నొదిలి ఉండలేడంటావు. ఎలా చచ్చేదే నీతో!” అంటూ లైటు ఆర్పి, తలుపులు దగ్గరగా వేసి వెళ్ళిపోయింది శాంతమ్మ.

***

“ఎలా వుందండీ మీ ఒంట్లో” అంటూ మంచం దగ్గరికొచ్చి నిలుచున్నాడు హరి.

> **“మేం ప్రపంచంలోని వాళ్ళందరి బాధలూ తీరుస్తున్నామని గాని, తీర్చగలమని గాని అనుకోవడం లేదు. మా దగ్గరికి వైద్యంకోసం వచ్చినవాళ్ళకి మా చేతనైన సాయం చేస్తున్నాం అంతే! డబ్బు చాలా అవసరమే కాని ఆ డబ్బు కోసం ఒక ప్రాణం రక్షించే బాధ్యత నుండి తప్పుకోం!”**

“ఎవరూ!...” అంటూ కళ్ళు చికిలించి చూసింది శాంతమ్మ.

“నేనూ... హరినండీ... గుర్తుపట్టారా?”

“నువ్వా... ఎంత మారిపోయావు!... చాలా సంవత్సరాలైంది కదూ నిన్ను చూసి... మీ అమ్మాయి పెళ్ళి చేశావుట కదా! చాలా సంతోషం. మీ ఆవిడ బాగుందా? ఇంతకీ ఎప్పుడొచ్చావు?” వెల్లికిలా పడుకున్న శాంతమ్మ కదలకుండానే కుశలమడిగింది.

“నేనొచ్చి అరగంటయ్యింది బస్సు దిగగానే రాణక్కను చూడాలని హాస్పిటల్‌కు వెళ్ళాను. మీరు ఇక్కడే వున్నారని ఒంట్లో బాగోలేదనీ రాణక్క చెబితే వెంటనే ఇలా వచ్చాను”.

నేనూ మా ఆయనా నాలుగు సంవత్సరాల క్రితం ఇక్కడకు చేరాం! ఆయన్ను చాలా బాగా చూసుకొని ఘనంగా సాగనంపారు. ఇక నావంతున్నది. నాకు సకల సౌకర్యాలూ ఏర్పాటుచేశారు. ఎపుడూ నువ్వే గుర్తు కొస్తుంటావు. ‘నా ఒక్కడికీ తప్ప మిగతా వాళ్ళకు సాయపడకండి’ అని చెప్పలేనన్నావు. నేను చెబుదామని ప్రయత్నించాను గాని నా కూతురు నా మాట వినలేదు. ఆనాడు అది నా మాట వినివుంటే ఈనాడు మా పరిస్థితి ఏమయ్యుండేదో! నా అల్లుడు నిజంగా ఒక దేవుడు. నా కూతురు అతనికంటే ఎత్తు ఎదిగిన దేవత!” అంటూ సీలింగువైపు చేతులు జోడించి నమస్కరిస్తూ కళ్ళు మూసుకొంది శాంతమ్మ. ఆమె ఎడమ కంటి నుండి ఒక్క కన్నీటిచుక్క తళతళా వజ్రంలా మెరుస్తూ ఆమె చెవి మీదికి జారింది.

●